# గరుడ వాహనం శ్రీవారి దేవేరి అలివేలు మంగ / సర్వభూపాలుడిపై కొలువుదీరిన పద్మావతిదేవి



తిరుచానూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: గరుడ వాహనం శ్రీవారి దేవేరి అలివేలు మంగ భక్తులను అనుగ్రహించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజైన మంగళవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో బాగంగా ఉదయాన్న సుప్రభాతంతో మేలుకొలిపి సహస్ర నామార్చన నిత్య అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండ పంకు వద్ద స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. తరువా తఅమ్మవారి ఉత్సవర్లను వాహన మండ పంకు వేంచేపు చేసి సర్వాంగ సుందరంగ అలంకరించారు. స్వర్ణ అలంకార శోభితురాలైన శ్రీ మహాలక్ష్మి తన వైకుంటనాథునికి ప్రీతి పాత్రుడైన గరుత్మంతుడిపై కొలువుదీర్చారు. దేదీప్యమైన దీపకాంతుల నడుమ అలివేలు మంగమ్మ తిరువీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. పెద్ద సంఖ్యలో అమ్మవారు భక్తులు కర్పూర నీరాజ నాలతో ఆమె కృపాకటాక్షాలకు పాత్రులైనారు. అంతక ముందుగా ఉదయం సర్వ భూపాల వాహనంపై కాళీయ మర్ధనుడి అలంకారంలో పద్మావతీ దేవి తిరువీధులలో విహరిస్తూ భక్తలను అనుగ్రహించింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో శ్యామల రావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ ఆగమ సలహా దారులు శ్రీనివాసాచార్యులు, అర్చకులు కేశరి స్వామి, ఏవియస్‌ఓ సతీష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## సెల్ప సెంటర్లకు అనుమతులు ఎలా ఇస్తారు !

**-వర్సిటీ అధికారుల తీరు నిబంధనలకు విరుద్ధం -పతి నిర్ణయం వివాదాస్పదమేనా..!**
**-మండి పడుతున్న ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు**



తిరుపతి విద్య, డిసెంబర్ 3 ప్రభాతవార్త: వర్సిటీ అధికారుల నిర్ణయాలు వివాధాస్పదంగా మారుతు న్నాయి. గతం కంటే 20 ఎగ్జామ్ సెంటర్లను తగ్గించిన అధికారులు, తమ అనుచరవర్గంగా ముద్రపడిన కళాశాలలకు ప్రాధాన్యతనిస్తూ పరీక్షా కేంద్రాలను పక్షపాత వైఖరితో కేటాయించారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీనికి తోడు అధికారులు మరో వివాదస్పద నిర్ణయానికి తెరలేపారు. కొన్ని ప్రైవేటు కళాశాల యాజమాన్యల ఒత్తిడికి తలొగ్గి అధికారులు వసతులు లేని కళాశాలలకు సెల్ఫ్ సెంటర్లను కేటాయించారు వర్సిటీ నిబంధనల ప్రకారం ఒక కశాలలో చదివిన విద్యార్థులకు అదే కళాశాలలో కాకుండా దగ్గరలోని మరో కళాశాలలో ఎగ్జామ్ సెంటర్ కేటాయించాలి. కానీ అధికారులు అందుకు విరుద్ధంగా నియమ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థులు తాము చదివిన కళాశాలలోనే పరీక్షలు రాసే విధంగా సెల్ఫ్ సెంటర్లకు అనుమతులు ఇచ్చారు. దీంతో పరీక్షలు సక్రమంగా జరుగుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బి కొత్తకోటలో రెండు సెల్ఫ్ సెంటర్లను ఏర్పాటు చేసి తమ ఇష్టానుసారంగా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రైవేటు కళాశాలల యాజమ్యాలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు

**-అధికారుల నిర్ణయంతో విద్యార్థులకు తప్పని తిప్పలు**

వర్సిటీ అధికారులు ఎగ్జామ్ నేషన్ సెంటర్ల కేటాయింపుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతం కంటే పరీక్షా కేంద్రాలను తగ్గించడం, 60 నుంచి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరీక్షా కేంద్రాలను కేటాయించడం పై విద్యార్థులు సైతం బలిపశువులను చేయవద్దని వాపోతున్నారు. సెల్ఫ్ సెంటర్లు ఇవ్వడంతో పరీక్షలు సజావుగా సాగుతాయనే నమ్మకం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని సెంటర్లకు అనుమతులు జారీ చేసి జవాబు బుక్లెట్స్ ను సైతం సరఫరా చేసి పరీక్షా కేంద్రాన్ని రద్దు చేయడం రాజకీయ. సామాజిక సమీకణాల నేపథ్యంలో జరిగిన కుట్రగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**-నేటి నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభం**

ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలలో బుధవారం నుంచి డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ మేరకు పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 64 పరీక్షా కేంద్రాలలో సుమారు 10 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

## షార్‌లో... మొదలైన కౌంట్‌డౌన్

**- నేడు పిఎస్ఎల్‌వి-సి59 రాకెట్ ప్రయోగం - ఆదిత్య ఎల్1కి తోడుగా ప్రోబా3 పరిశోధనలు - సూర్యుని రహస్యాలు ఛేదించడమే లక్ష్యం - శ్రీహరికోటలో ఈసా, ఇస్రో శాస్త్రవేత్తల సందడి - అందరిచూపు మిషన్ కంట్రోల్ సెంటర్ మీదే - అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య అంతరిక్ష కేంద్రం**

శ్రీహరికోటలో ప్రయోగానికి సిద్ధంగా పిఎస్ఎల్వి సి-59 రాకెట్



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 3 ప్రభాతవార్త : శ్రీహరికోట నుంచి నేటి మధ్యాహ్నం 4.08 గంటలకు పిఎస్ఎల్‌వి-సి59 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్ నింగికి ఎగిరేందుకు సిద్ధంగా ఉంది. యూరోపియన్ స్పేస్ ఏజన్సీకి చెందిన ప్రోబా-3 అనే ప్రాజెక్టులోని రెండు ఉపగ్రహాలను ఈ రాకెట్ అంతరిక్షంలోకి చేర్చాల్సి ఉంది. ఈసా నిర్మించిన జంట అంతరిక్ష పరిశోధన ఉపగ్రహాలు సూర్యునిపై పరిశోధనలకు ఉపయోగపడనున్నాయి. ఇంతకు ముందు ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1కు తోడుగా ప్రస్తుతం ప్రోబా3 పరిశోధనలు చేపట్టనుంది. ఆదిత్య ఎల్1, ప్రోబా3లు సేకరించే డేటా ఒకదానికొకటి పూర్తి చేస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. సూర్యుని బాహ్య వలయంలోని కరోనా పొరను అధ్య యనం చేయడం, అక్కడ అవసరమైతే కృత్రిమ సూర్య గ్రహణాలు కూడా ఏర్పాటు చేసి సూర్యుడి గుట్టును రట్టు చేసేందుకు ఈ ప్రోబా3ని అత్యంత ఆధునికమైన ఉపకరణాలతో నిర్మించి ఉన్నారు. ఈ డేటాను సేకరించే ఉపగ్రహాలు ఇస్రో ప్రయోగించే పెరిజి, అపోజిల దూరం కన్నా కొంత భిన్నంగా ఉండటం ఒక విశేషం. పెరిజి అంటే భూమికి దగ్గర దూరం కేవలం 600 కిలోమీటర్లు కాగా, అపోజి అంటే భూమికి ఎక్కువ దూరం 60,530 కిలోమీటర్లుగా ఈ ఉపగ్రహాలు పరిభ్రమించి శాస్త్రవేత్తలకు విలువైన సమాచారం అందిస్తాయి.

షార్‌లో అత్యంత ఆధునిక మిషన్ కంట్రోల్ సెంటర్ ఇదే



**మన ఘనత సోపానాలు పిఎస్ఎల్‌విలు :** పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ప్రయోగించే రాకెట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు ఘనత సోపానాలుగా నిలుస్తున్నాయి. అంతరిక్షంలోకి స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలను అలవోకగా మోసుకెళ్లే పిఎస్ఎల్‌వి రాకెట్లు వరుస విజయాలు సాధించాయి. ప్రస్తుతం ఈసా వంటి అంతరిక్ష పరిశోధన కేంద్రాలు సైతం మన పిఎస్ ఎల్‌విల ద్వారా ఉపగ్రహాలను ప్రయోగించుకునేందుకు ముందుకొస్తున్నాయి. పిఎస్ ఎల్‌వి-సి59 రాకెట్‌ను చాలాకాలం తర్వాత ఆరు స్ట్రాపాన్ బూస్టర్లతో నిర్మించారు. ప్రయోగం సమయంలో 44.5 మీటర్ల ఎత్తు, 320 టన్నుల బరువు కలిగిన ఈ రాకెట్ 550 కిలోల బరువు ఉన్న ప్రోబా3లోని రెండు స్పేస్ క్రాఫ్టులను మోసుకెళ్లాల్సి ఉంది. ఈ రాకెట్ విజయం సాధించి ఇస్రోకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తుందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

**మిషన్ కంట్రోల్ సెంటర్‌పైనే అందరి దృష్టి**

శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలను వీక్షించడానికి శాస్త్రవేత్తలకు వేదికయిన మిషన్ కంట్రోల్ సెంటర్ మీద ప్రపంచం దృష్టి కేంద్రీకృతమైంది. శ్రీహరికోటలో అత్యంత ఆధునిక పద్ధతిలో జీరో పాయింట్‌కు దగ్గరగా గతంలోనే ఈ ఎంసిసిని నిర్మించారు. ఎంతోమంది స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలు, ఇస్రో పెద్దలు, రాజకీయ ప్రముఖులు సైతం ఈ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచే రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తారు. అక్కడ విజయాలు సాధించిన అనంతరం కరచాలనాలు, చప్పట్లు ఇక్కడి నుంచే దేశానికి తెలుస్తాయి. ఈ సారి కూడా ఈసా, ఇస్రో శాస్త్రవేత్తలు ఈ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచే రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తారు. లాంచ్ రిహార్సల్స్ వంటి కీలకమైన కార్యక్రమాలు సైతం ఈ సెంటర్ నుంచే పర్యవేక్షిస్తారు. రాకెట్ ప్రయోగానికి ముందు, తర్వాత కూడా నిర్ణీత సమయం వంటివి ప్రకటించేది కూడా ఇక్కడి నుంచే. పెద్ద కంప్యూటర్ తెరల మీద వివిఐపిలు, విఐపిలు కూర్చొని రాకెట్ ప్రయోగాన్ని తిలకిస్తూ ఆనందం, ఉత్కంఠ కలగలిసిన సన్నివేశాలు కనిపించేది కూడా ఈ మిషన్ కంట్రోల్ సెంటర్‌లోనే. మొత్తంమీద శ్రీహరికోటలో విదేశీ కీలక ప్రయోగం జరుగుతున్న నేపథ్యంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సిఐఎస్ఎఫ్ దళాలు, తిరుపతి జిల్లా పోలీసు బలగాలు కీలక ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## నిర్మాణ పనులు వేగవంతం చేయాలి / - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్



స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మాణ పనుల పురోగతిపై చర్చిస్తున్న కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 3 ప్రభాతవార్త: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, తిరుపతి రేణిగుంట బైపాస్ రోడ్డుకు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పనులపై ఎన్హెచ్ఎఐ, రెవెన్యూ సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులకు, తిరుపతి రేణిగుంట బైపాస్ రోడ్డు తదితరాలకు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పురోగతిపై జెసి శుభం బన్సల్ తో కలిసి వర్చువల్ విధానంలో ఎన్హెచ్ఎఐ పిడిలు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీఓలు తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్న కడప- రేణిగుంట , తిరుపతి మదనపల్లి , రేణిగుంట-నాయుడుపేట 6 లేన్ వంటి రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుండి రేణిగుంట వరకు) 6 లేన్ల రహదారి వేగవంతం చేయాలని సూచించారు. అలాగే రేణిగుంట నుండి చెన్నై వరకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని భూ సేకరణలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో నాయుడుపేట తూర్పు కనుపూరు 6 లేన్ల రహదారి 35 కి.మీ, చిల్లకారు క్రాస్ నుండి తూర్పు కాన్పూర్ వరకు 4 లేన్ల రహదారి మరియు తూర్పు కాన్పూర్ నుండి కృష్ణపట్నం పోర్ట్ సౌత్ గేట్ 6 లేన్ల రహదారి 36 కి.మీ, తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్ట్ రోడ్డు పొడిగింపు 6 లేన్ల రహదారి 16 కి.మీ అభివృద్ధి పనులు కూడా టైం లైన్ మేరకు పూర్తి చేయాలనీ సూచించారు. పారిశ్రామిక రంగానికి జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా మరింత సౌకర్యం కలగనున్నదనీ తెలిపారు. భూసేకరణ పెండింగ్ అవార్డులు త్వరిత గతిన నిబంధనల మేరకు చేపట్టేలా ఉండాలని తెలిపారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎన్ హెచ్ అధికారులు సమన్వయంతో నిర్దేశించుకున్న త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చెన్నై జాతీయ రహదారి 205కి సంబంధించిన విస్తరణ కొత్త ప్రతిపాదనలకు చెందిన భూసేకరణ చేపట్టాలని, అలాగే రైల్వే ప్రాజెక్టులు నడికుడి శ్రీకాళహస్తి ప్రాజెక్ట్ కు సంబంధించిన భూ సేకరణలో ఇబ్బందులు లేకుండా ఆర్డీఓ లు, తాశిల్దార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి పాకాల రైల్వే ట్రాక్ డబుల్ లైన్‌కు సంబంధించిన భూ సేకరణ పనులలో పురోగతి ఉండాలని తెలిపారు. అలాగే తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, పిడి ఎన్హెచ్ఎఐలు తిరుపతి వెంకటేష్, నెల్లూరు ఎంకే చౌదరి, చెన్నై రవీంద్రరావు, తాసిల్దార్లు, విఆర్ఓలు, కలెక్టరేట్ విభాగం డిటి భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 3 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లాఎస్పీ ఎల్ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన మంగళవారం నాయుడుపేట సబ్‌డివిజన్ పరిధిలోని పెళ్ళకూరు, దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌లను అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని పలుకేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి తెలిపారు. జిల్లాఎస్పీ ఎల్ సుబ్బ రాయుడు మాట్లడుతూ తిరుపతి జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటుచేసి వారిద్వార నేరాలను నియంత్రించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంతేకాకుండ జాతీయ రహదార్లుపై గంజాయి, ఎర్రచందనం ,రేషన్‌బియ్యం అక్రమ రవాణా జరగకుండ నిఘా వ్యవస్థను ఏర్పాటుచేసి ఉక్కుపాధం మోపడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలు, ఫేక్ లోన్‌యాప్‌లు గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకుండా అరికట్టాలని సూచించారు. రౌడిషీటర్లు, పాతనేరస్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేకమైన నిఘా పెట్టాలని తెలియజేశారు. జాతీయ రహదార్లుపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యచరణ చేపట్టి ప్రమాదకరమైన మలుపులు, రోడ్డుక్రాసింగ్‌లను గుర్తించి ప్రదేశంలో సూచిక బోర్డులు, బారిగేట్లు ఏర్పాటు చేసి ప్రమాధాలు జరగకుండ అరికట్టాలన్నారు. నిరంతరం వాహనాలు తనిఖీలు చేపట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఆయన వెంట నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు, పెళ్ళకూరు, దొరవారిసత్రం ఎస్సైలు నాగరాజు, అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## లంచం కొడితే...అంగవైకల్య ధృవికరణ పత్రం!

**-ప్రభుత్వం మారిన తీరు మారని ఆసుపత్రి -డయాల్సిస్ భవనంలో సమస్యల తిష్ట**
**-ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన బృందమ్మ**

శ్రీకాళహస్తి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో పాలకులు మారినా, రాష్ట్రంలో ప్రభుత్వం మారినా సిబ్బంది తీరుమారటం లేదు. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఆంగవైకల్యం సర్టిఫికేట్ల వ్యాపారం విచ్చల విడిగా జరుగుతుందనే సమాచారం అందుకున్న స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఆంగవైకల్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను జారి చేస్తున్నారు. గత ప్రభుత్వ హాయాంలో ఇక్కడ కొందరు బ్రోకర్లు తయారయ్యారు. వారు ధృవీకరణ పత్రాలు కావాల్సి వారితో 'డీల్' ఖరారు చేసుకొని డాక్టర్లుకు కొంత అందిస్తూ వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మంగళవారం బృందమ్మ సుమారు 8 సంవత్సరాల నుంచి ఆరోగ్య సమస్యలతో సతమతమౌతున్న వ్యక్తిని పిలుచుకొని ఆసుపత్రికి చేరారు. ఇక్కడ సర్టిఫికేట్‌కు రూ.15వేలు వసూలు చేసుకుంటున్నారనే సమాచారంతో ఆమె ఆసుపత్రికి చేరారు. అక్కడ సంబందిత డాక్టర్లను వాకబు చేయగా వారు సంబంధం లేని సమాధానాలు చెప్పారని తెలిసింది. అయితే కళ్ళ ముందు అంగవైకల్యం కనబడుతుంటే రికార్డులు, సర్టిఫికేట్లు లేదని చెప్పటం పట్ల బృందమ్మ అసహనం వ్యక్తం చేసారు. ఇది పేదల ఆసుపత్రి ఇక్కడ కొందరు వైకాపా మధ్యవర్తులు అంగవైకల్య సర్టిఫికేట్ల వ్యాపారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని వారికి డాక్టర్లు సహకరిస్తే ఇబ్బందులు పడతారని బృందమ్మ హెచ్చరించారు.

**డయాల్సిస్ కేంద్రంలో రోగులు పెరిగారు:**



దయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

గతంలో ఏరియా ఆసుప్రతిలో డయాల్సిస్ కేంద్రంను తెలుగుదేశం హయాంలో ఏర్పాట్లు చేసారు. ఈ కేంద్రం నిరుపేదల సేవలో ఎంతో ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వం హయాంలో ఈ కేంద్రం గురించి పట్టించుకోలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కేంద్రం గురించి బృందమ్మ శ్రద్ధ చూపారు. టెక్నిషియన్లను నియమించారు. అయితే ఇక్కడ స్థానికుల కన్నా గూడూరు, సూళూరుపేట, సత్యవేడు నుంచి రోగులు అధికంగా వస్తున్నారు. మంగళవారం బృందమ్మ పరిశీలనలో స్థానికే తరులే అధికంగా కనబడ్డారు. అయితే భవనం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. పెయింటింగ్ చేయాల్సి ఉంది. అలాగే వార్డుల్లో ఉన్న రోగులతో మమేకమయ్యారు. ఆసుపత్రిలోమందుల పరిస్థితిని వాకబు చేసారు.

**7న సమావేశం:**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఈ నెల 7న సమావేశం ఏర్పాటు చేసినట్లు బృందమ్మ తెలిపారు. డయాల్సిస్ కేంద్రానికి రోగుల సంఖ్య పెరిగిందన్నారు. అంతేకాక కొన్ని మైనర్ సమస్యలు న్నాయని వాటిని పరిష్కరించి పేదల సేవల్లో నిమగ్నమయ్యేటట్లు చూస్తామన్నారు.

## రోగులు పెరుగుతున్నారు... ప్రభుత్వాస్పత్రి స్థాయిని పెంచండి

**వంద పడకలకు పెంచండని...సిఎంకు భానుప్రకాశ్ వినతి**



సిఎంకు వినతి పత్రం ఇస్తున్న భానుప్రకాష్

పుత్తూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త : పుత్తూరు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి స్థాయిని 100 పడకలకు పెంచాలని కోరుతూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి పుత్తూరులో వంద పడకల ఆస్పత్రి వుండడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయనకు వివరించారు. ఇదిలా వుండగా పుత్తూరులో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు ప్రతిపాదన గత ప్రభుత్వాల్లో వచ్చినప్పటికీ ఆచరణ రూపం దాల్చలేదు. పుత్తూరుకు 12 కిలోమీటర్ల దూరంలో నగరిలో వంద పడకల ఆస్పత్రి వుండడం వల్ల ఇంత తక్కువ దూరంలో మరో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం వుండదని ఉన్నతాధికారులు భావించడం వల్ల ఆ ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. అయితే పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రతి రోజు 500 మందికి పైగా ఔట్ పేషెంట్‌లుగా చికిత్సలు పొందుతున్నారు. నారాయణ వనం, పిచ్చాటూరు, నాగలాపురం తదితర తూర్పు మండలాలతో పాటు వడమాలపేట, కార్వేటినగరం నుంచి ఎస్ఆర్‌పురం మండలం వరకూ ప్రజలకు పుత్తూరు ప్రభుత్వాస్పత్రి అనుకూలంగా వుంటుంది.

ఆ మేరకు నగరి కంటే పుత్తూరులోనే వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు ఆవశ్యకమైనప్పటికీ రాజకీయ కారణాల వల్ల నగరిలో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. పుత్తూరు పొరుగు మండలమైన కార్వేటినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మార్చినప్పటికీ భవనాలు తదితర మౌలిక సదుపాయాలు లేనందున అక్కడ 50 పడకల స్థాయి వైద్య సేవలు ప్రజలకు అందడం లేదు. వైద్యులకు కూర్చునేందుకు గదులు కూడా లేనందున ప్రజలకు సక్రమంగా సేవలు అందించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పది మండలాలకు కేంద్రంగా వుండే పుత్తూరులో మాత్రం ఇప్పటికీ 30 పడకల స్థాయిలోనే ఆస్పత్రి వుంది. 100 పడకల ఆస్పత్రి ఏర్పాటైతే చర్మ, కళ్లు, ఎముకలు తదితర విభాగాలతో పాటు స్త్రీలు, పిల్లల వ్యాధులకు సంబంధించి స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో వుంటారు. ఆపరేషన్ థియేటర్, బ్లడ్ బ్యాంక్ వంటి సదుపాయలు వస్తాయి. ప్రజలు తిరుపతికి వెళ్లకుండా దాదాపుగా పుత్తూరులోనే సరైన వైద్యాన్ని, సరైన సమయంలో పొందడానికి వీలు కలుగుతుంది.

## మృత్యుకుహారంగా బాలచంద్రునికుంట

**- తరచూ ప్రమాదాలు - గుంతలో పడి ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు యువకులు - ఒకరి ఆచూకీ లభ్యం.. మరొకరి కోసం గాలింపు చర్యలు**
**- పొట్టకూటి కోసం వచ్చి నీటిలో కలిసిన వలస ప్రాణాలు - 50 అడుగుల భారీ గుంతపై నోరుమెదపని అధికారులు**



మృతదేహాల కోసం బోటులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు





మృతుడు మధుసూదన్‌రెడ్డి, షారుఖ్



సంఘటనా స్థలంలో పోలీసు, రెవెన్యూ అధికారులు

చిట్టమూరు, డిసెం బర్ 3 ప్రభాతవార్త : చిట్టమూరు మండలంలోని నాయుడుపేట- మల్లాం ఆర్‌అండ్‌బి రహదారి పరిధిలో ఏ వైసీపీ నేత ఏర్పాటు చేసుకున్న అక్రమ సామ్రాజ్యంలో కట్టే కట్టడాలకు మట్టి కోసం తవ్విన భారీ గుంత వాహన చోదకులకు మృత్యు కుహరంగా మారుతోంది. కాలం ఏదయినా ఏమాత్రం అజ్రాత్తగా ఉన్నా ఈ గుంతలోని నీటిలో ప్రాణాలు కలిసి పోవాల్సిందే. ఈ ప్రాంతానికి పొట్ట కూటి కోసం వచ్చిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వాసితో పాటు జార్ఖండ్‌కు చెందిన మరో యువకుడు మంగళవారం ఉదయం 7 గంటల సమ యంలో గుంతలో పడి మృత్యువాత పడ్డారు. మండల కూడలి ప్రాంతమైన కొత్తగుంట, మల్లాంలో కోటకు చెందిన ఓ వ్యాపారి చికెన్ దుకాణంలో బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి (45), జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన షారుఖ్ (23) అనే యువకులు పని చేస్తున్నారు. అయితే మల్లాంలోని మరో చికెన్ దుకాణానికి యజమాని ఆదేశాల మేరకు తమ మోటార్ బైక్‌లో చికెన్‌తో కొత్తగుంట నుంచి బయలుదేరారు. పోలీసులు వారిస్తున్నా వారి కళ్లుగప్పి వెళుతుండగా మధుసూదన్‌రెడ్డి రోడ్డుపై ప్రవహిస్తున్న ఒక్క అడుగు నీటి ప్రవాహంలోనే అదుపుతప్పి రహదారి పక్కనే 50 అడుగుల లోతు ఉన్న పెద్ద గుంటలో పడిపోయాడు. అయితే వెనుక ఉన్న షారుఖ్ గల్లంతవుతున్న మధుసూదన్‌రెడ్డిని కాపాడే ప్రయత్నంలో తానుసైతం పడిపోయాడు. ఇలా ఇద్దరు తమ నిర్లక్ష్యానికి తోడు, ఓ పారిశ్రామికవేత్త మట్టి తీసేసిన భారీ గుంట అందరి ముందే వలస కూలీల ప్రాణాలు బలిగొనడం పట్ల పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో మల్లాం సమీపంలోని తాగేటమ్మ గుడి వద్ద రొయ్యల వాగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఎంపిడిఓ మనోహర్‌గౌడ్, తహశీల్దార్ ప్రసాద్, ఎస్ఐ చిన బలరామయ్య రాకపోకలను అడ్డుకొని ప్రజల ప్రాణాలు కాపాడే ప్రయత్నాలు చేశారు. అయితే వరద ఉధృతి తగ్గుముఖం పట్టడం, వర్షాలు సైతం లేని నేపథ్యంలో ఇలా ఇద్దరు గుంటలో పడి మృతిచెందడం ఈ ప్రాంత వాసులను తీవ్రంగా కలచివేసింది. మృతుడు మధుసూదన్‌రెడ్డికి భార్యపిల్లలు ఉండగా, జార్ఖండ్ ప్రాంతానికి చెందిన షారుఖ్‌కు వివాహమై మూడు నెలలవుతుండగా ఇరువురి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆలస్యంగానైనా విషయం తెలుసుకున్న జిల్లా అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డిఎస్పీ రమణ కుమార్, వాకాడు సిఐ హుస్సేన్ బాషా, ఎస్ఐ చినబలరామయ్య, తహశీల్దార్, ఎంపిడిఓల ఆధ్వర్యంలో గత ఈతగాళ్లతో బోట్లలో గాలించినప్పటికీ మధ్యా హ్నం 3 గంటల ప్రాంతంలో మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. కానీ, షారుఖ్ మృతదేహం లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలను తీవ్రతరం చేస్తున్నట్లు తెలిపారు. గత వేసవి కాలంలోను ఇదే గుంటలో పడి సోమసముద్రం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇలా పలువురి ప్రాణాలు బలిగొంతున్న గుంత తీసిన వ్యాపారవేత్తపై చర్యలు తీసుకుంటారా.. లేక ప్రజల ప్రాణాలే కదా అని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారా వేచి చూడాల్సి ఉంది.

## ఫెంగల్ తుఫానుతో వరి.. స్వీట్‌కార్న్ పంటలకు నష్టం



కుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ఫెంగల్ తుఫానుతో రైతులు సాగు చేస్తున్న వరి, స్వీట్ కార్న్ పంటలకు నష్టం వాటిల్లింది. కుప్పం, రామకుప్పం మండలాల్లో సుమారు 10 హెక్టార్లలో వరి పంట, 4 హెక్టార్లలో స్వీట్‌కార్న్ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే శాంతిపురం మండలంలో 6.5 హెక్టార్లలో వరి, 4.8హెక్టార్లలో స్వీట్‌కార్న్ పంటలు దెబ్బతిన్నాయి. శాంతిపురం మండలంలో 5 హెక్టార్లలో వరి పంట నేలవాలినట్లు అధికారులు తెలిపారు. మండలాల్లో ముందే వరిపంట కోసిన నేపథ్యంలో తుఫాను ప్రభావం పెద్దగా పంటలపై చూపలేదు. అలాగే ఉద్యానవన పంటల నష్టంపై ఆశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు.

## కుప్పం తెదేపా కార్యాలయంలో మెగా జాబ్ మేళా

కుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధ్వర్యంలో ఈనెల 5వతేది కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. దాదాపు 400కు పైబడి ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎనిమిదో తరగతి మొదలు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు. డా॥ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ ఫౌండేషన్, ఎయుస్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎగిల్ ఎయిర్‌పోర్ట్ సర్వీస్, అపోలో ఫార్మసీస్, లక్ష్య ఫౌండేషన్, మెడిటెక్ హైర్ తదితర సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వివరాలకు రాజా 9052507933, లోకేష్ 9963561755నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, దరఖాస్తులతో హాజరు కావాల్సి ఉంది.

## సిఎం చంద్రబాబును కలసిన ఎఎం రంగనాథ్

వి.కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వి.కోట మండల టిడిపి అధ్యక్షుడు ఎఎం రంగనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వి.కోట మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, బైపాస్ రోడ్డు, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలపై సిఎంకు ఆయన వినతిపత్రం అందించారు. దీనిపై సిఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నేత విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు అబకలదొడ్డిలో కడ పి.డి.చే ప్రజా దర్బార్

శాంతిపురం, డిసెంబర్ 3 ప్రభాతవార్త

మండలంలోని అబకలదొడ్డి గ్రామ పంచాయతీలోని ఐటిఐ కళాశాల ప్రాంగణంలో బుధవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం తదితరులు హాజరవుతారన్నారు. పంచాయతీ ప్రజలు తమ సమస్యలను నేరుగా వినతుల రూపంలో తెలియజేయవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేటినుంచి శ్రీ పెరుమాళ్ స్వామి ఆలయ కుంబాభిషేక ఉత్సవాలు

కుప్పంరూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త



మండలంలోని పైపాళ్యం పంచాయతీ చిన్న బొగ్గుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న తిమ్మరాయస్వామి (పెరుమాళ్‌స్వామి) ఆలయ జీర్ణోద్ధారణ, కుంబాభిషేక కార్యక్రమాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 4వతేది గంగాపూజ, కలశస్థాపన, మహాగణపతి హోమం, 5న యాగశాల ప్రవేశం, అంకురార్పణ, కలశారాధన, హోమాలు, స్వామివారికి పూజలు, గోపుర కలశ స్థాపన, 6వతేది స్వామివారికి ప్రత్యేక పూజలు, మహాకుంబాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## కుప్పం నియోజకవర్గంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో ఆధార్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం ఈనెల 6వతేది నుంచి 19వతేది వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కుప్పంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ అప్‌డేట్, బయోమెట్రిక్ తదితర సమస్యలతో పాటు అపార్ కార్డుల మంజూరుకై కుప్పంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించాలని కోరారన్నారు. ఈ నేపథ్యంలో కుప్పంలో ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. గుడుపల్లె మండలంలో ఈనెల 6,7 తేదీలు, కుప్పం రూరల్‌లో 9,10 తేదీలు, కుప్పం అర్బన్‌లో 11,12తేదీలు, రామకుప్పంలో 16,17తేదీలు, శాంతిపురంలో 18,19 తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజును నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఆధార్ శిబిరాల వద్ద ప్రజల సౌకర్యార్థం షామియానా, టేబుళ్లు, కుర్చీలు, మైక్‌సెట్, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి తదితరాల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశించారు.

## కాపు సంఘ అధ్యక్షుడుగా నానబాల మణి

పుంగనూరు రూరల్,డిసెంబరు 3, ప్రభాతవార్త :



జాతీయ కాపు సంఘ పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడుగా పట్టణానికి చెందిన నానబాల మణి నియమితులయ్యారు. ఈమేరకు సంఘ వ్యవస్థాపకుడు మురళీనాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్భంగా నానబాల మణి మాట్లాడుతూ సమాజసేవకు కాపు సంఘం ఎపుడూ ముందుంటుందని,తనపై నమ్మకంతో నియోజకవర్గ అధ్యక్షుడుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## వాకింగ్‌ట్రాక్‌కు పగుళ్ళు

పుంగనూరురూరల్,డిసెంబరు 2, ప్రభాతవార్త :



పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ ఇటీవల తుఫాను వర్షాల కారణంగా దెబ్బతింటోంది. ఎడతెరపి లేకుండా మూడు రోజుల పాటూ కురిసిన వర్షాలతో వాకింగ్ ట్రాక్ కోసం పరచిన మట్టితొలగిపోయి రాళ్లు స్థానభ్రంశం చెందుతున్నాయి. దీంతో ట్రాకింగ్ దెబ్బతింటోంది. అధికారుల స్పందించాల్సి ఉంది.

## అసిస్టెంట్ కలెక్టర్‌చే తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

తవణంపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త:



జిల్లాలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ మంగళవారం తవణంపల్లె తహశీల్దార్ కార్యాలయంను సందర్శించారు. అసిస్టెంట్ కలెక్టర్ శిక్షణలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం పనితీరుపై శిక్షణ పొందాల్సి వుంది. ఈనేపథ్యంలో చిత్తూరు డివిజన్‌లో మంచి పనితీరు కనబర్చుతున్న తవణంపల్లె తహశీల్దార్ కార్యాలయంను ఎంపిక చేసుకుని అవగాహన కోసం మంగళవారం సందరి ్శంచారు. ఈమేరకు మండలంలో వివిధ రకాల రెవెన్యూ పరమైన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి తహశీల్దార్ సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కార్యాలయంలో రన్నింగ్ ఫైల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మండల తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మండల స్థాయి మోడల్ ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్ష

కల్లూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త



చిత్తూరు జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లూరు నందు మండల స్థాయి మోడల్ ఎన్ఎంఎంఎస్ పరీక్షను నిర్వహించగా ఈ పరీక్షకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పులిచెర్ల మరియు కల్లూరు నుండి మొత్తం 35 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీవాణి తెలిపారు. ఈ పరీక్షల్లో 180 మార్కులకుగాను 104 మార్కులతో పులిచెర్ల విద్యార్థి చరణ్ మొదటి స్థానం, కల్లూరు విద్యార్థులు 82 మార్కులతో యస్రబ్ ద్వితీయ స్థానం ,73 మార్కులతో సాహిస్తా తృతీయ స్థానంలో నిలవగా నాల్గవ స్థానం 71 మార్కులతో పులిచెర్ల విద్యార్థి సాధించారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 8, 12, 24వ తేదీ ఆదివారం చిత్తూరులో నిర్వహించే ప్రధాన పరీక్షకు బాగా తర్ఫీదు కావాలని, ప్రధాన పరీక్షల్లో ఎన్.ఎం.ఎం.ఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కాబడిన విద్యార్థులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్ధులు, రహమత్ భాష, వేణుగోపాల్, గుర్రయ్య, సురేష్ ,మురళీ మోహన్,ఈశ్వరయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ డా॥ కంచర్లను కలసిన యువత.. దళిత నేతలు

శాంతిపురం,డిసెంబర్ 3 ప్రభాతవార్త



ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌ను శాంతి పురం మండల తెదేపా నేతలు, దళిత నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌ను వారు సత్కరించాలని కోరగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. తనకు బొకేలు, శాలువలు అవసరం లేదని పేద విద్యార్థుల చదువుల కోసం ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి అందిస్తే చాలని ఆయన సూచించారు. దీంతో తెదేపా నేత రాజు అప్పటికప్పుడు వంద నోట్ పుస్తకాలు, వంద పెన్నులు తెచ్చి అందించారు. కార్యక్రమంలో దళిత నేత దేవరాజుమాదిగ, సురేష్, కృష్ణ, బాలకృష్ణ, కళ్యాణ్, శివ, ప్రశాంత్, సింహాద్రి, కర్లగట్ట శంకరప్ప, వేణు పాల్గొన్నారు.

## చింతమాకులపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

వి.కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త



మండలంలోని చింతమాకులపల్లిలో వ్యవసా యాధికారిణి రాజ్యలక్ష్మి అధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వరిసాగు, ప్రధాని ఫసల్ భీమా యోజన పథకం గురించి వివరించారు. రైతులు ప్రీమియం చెల్లించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుసెనగ పంటకు డిసెంబర్ 15, వరిపంటకు డిసెంబర్ 31దతేది లోగా ప్రీమియం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కదిరేపల్లి సీతారామాలయంలో హుుండీ చోరీ

చౌడేపల్లి, డిసెంబర్ 3 ప్రభాతవార్త



సీతారామాలయంలో హుుండీ చోరీకి గురైన సంఘటన సోమవారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. గ్రామస్తుల కథనం మేరకు... మండలంలోని 29.ఎ.చింతమాకులపల్లి పంచాయతీ బి.కదిరేపల్లి గ్రామ నడిబొడ్డులో సీతారామాలయం వుంది. సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయానికున్న తాళాలు పగుగొట్టి లోనికి ప్రవేశించి హుుండీని దొంగలించుకొని వెళ్ళినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఇలాంటి చర్యలు జరగకపోవడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది.

## జడివానతో నేలకూలిన ఇంటిగోడ

చౌడేపల్లి, డిసెంబర్ 3 ప్రభాతవార్త



తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షంతో ఇంటిగోడ కూలి ఎలాంటి ప్రమాదం సంభవించని సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండల కేంద్రమైన చౌడేపల్లి టీచర్స్ కాలనీలో నారాయణమ్మ జీవిస్తోంది. గత 3రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇంటికున్న గోడ కూలింది. ఆ సమయంలో గోడకింద ఎవరూ లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిళ్ళలేదు. ఇంటి గోడకూలి నిర్మించుకోలేని స్థితిలో వున్న నారాయణమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## యానాదులకు దుప్పట్లు పంపిణీ

చౌడేపల్లి, డిసెంబర్ 3 ప్రభాతవార్త



మండలంలోని దిగువపల్లి పంచాయతీ నెట్టిబండ యానాదికాలనీ వాసులకు దుప్పట్లు పంపిణీ చేసారు. జిల్లా గిరిజనసంక్షేమశాఖ అధ్యక్షుడు మూర్తి(సిరిసంస్థ) ఆధ్వర్యంలో దుప్పట్లను తేదేపా నాయకుడు జన్నే సుబ్రమణ్యం నాయుడు, యానాదిసంఘం నేత కృష్ణయ్యలు 25కుటుంబాల వారికి దుప్పట్లు పంపిణీ చేసారు. శ్రీనివాసులు, తేదేపా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## వైకల్యం అనేది శరీరానికి కానీ మనసుకు కాదు ఎం ఈ ఓ బాబ్జి

పాకాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త.



పాకాల మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అధితిగా బాబ్జి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం అనేది జబ్బు కాదని తల్లిదండ్రుల క్రోమోజోముల అపసవ్యత వల్ల దివ్యాంగుల పిల్లలు జన్మిస్తారని అన్నారు.వారిని దగ్గరికి చేర్చుకొని తగిన తర్ఫీదు ఇస్తే సాధారణ పిల్లల వలె మార్పు చెందుతారని పేర్కొన్నారు. అంధుల కోసం లిపి కనిపెట్టిన బ్రెయిలీ కూడా ఒక అందుడే అని, ప్రముఖ భారతీయ నటి సుధా చందరన్ కూడా దివ్యాంగులే ,కానీ వారు వివిధ రంగాలలో రాణించారాని అన్నారు.కావున తల్లిదండ్రులుగా మీరు కూడా వారిలో లోపాన్ని ఎత్తి చూపించకుండా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించాలని అన్నారు.అనంతరం విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ,ఉపాధ్యాయులు కుసుమ,సహిత ఉపాధ్యాయులు ముని కృష్ణ రెడ్డి,సి.ఆర్.పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అంతర్ కళాశాలల బ్యాట్మింటన్‌లో ప్రతిభ కనబరచిన పివికెయస్ అధ్యాపకులు

చిత్తూరురూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:



శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నందు జరిగిన అంతర్ కళాశాలల అధ్యాపకుల క్రీడా పోటీలలో తమ కళాశాలకు చెందిన వ్యాయామవిద్య అధ్యాపకులు ఆర్ లోకేష్, గ్రంధాలయశాస్త్ర అధ్యాపకులు శ్రీకాంత్‌లు డబుల్స్ బ్యాట్మింటన్ విభాగంలో ప్రధమ స్థానంలో నిలిచారని పివికెయస్ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి తెలిపారు. ఈ విజయం కళాశాలకు ఎంతో గర్వకారణమని, అధ్యాపకులు, విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్‌ప్రిన్సిపాల్ మీరా సాహెబ్, ఇతర అధ్యాపకేతర బృందం అభినందించారు.

## 14వ తేది నుంచి శ్రీ విరుపాక్షమ్మ ఆలయ 13వ వార్షికోత్సవాలు

కల్లూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త

పులిచెర్ల మండలం దేవలంపేట శ్రీ విరుపాక్షమ్మ ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆలయ 13వ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాకులు గురు స్వామి అరుణ కుటుంబ సభ్యులు తెలిపారు. 14వ తేదీ శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని 15వ తేదీ ఆదివారం అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## చల్లాబాబును కలసిన విశ్రాంత డిఎస్పీ

పుంగనూరు,డిసెంబరు 3 ప్రభాతవార్త :



నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లాబాబును విశ్రాంత డిఎస్పీ,రాష్ట్ర వాల్మీకిసంఘ అధ్యక్షుడు సుకుమార్‌బాబు మంగళవారం చల్లా బాబు ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. వాల్మీకి సంఘస్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్ హామీను ఆయనకు గుర్తుచేశారు. వాల్మీకులు తరాలుగా పేదలుగానే మిగిలిపోతున్నారని,ఎస్టీలుగా గుర్తించి వృద్దిలోనికి తీసుకురావాలని సూచించారు. ఈనెల 5న పుంగనూర పట్టణంలో జరిగే తన కుమార్తె నమ్రతశ్రీ వివాహానికి హాజరుకావాలని ఆయన చల్లాబాబుకు పెండ్లిపత్రిక అందచేశారు. సుకుమార్‌బాబు అధ్వర్యంలో జరుగుతున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాలు ఎందరికో సాయపడ్డాయని, పేదలు,ప్రజాసేవకు ఎపుడూ ముందుండే సుకుమార్‌బాబు తమకు కొండంత మద్దతని చల్లాబాబు వాఖ్యానించారు.

# తిరుపతి డివిజన్

## సత్తా చాటారు!

-జాతీయస్థాయి పోటీల్లో టిటిడి విజిఓలకు పతకాలు



**తిరుమల,డిసెంబర్3ప్రభాతవార్తప్రతినిధి:** అఖిల భారత పోలీస్ లాన్‌టెన్నీస్ ఛాంపియన్‌షిప్‌లో టిటిడి విజిలెన్స్ విభాగం విజిఓలు సత్తాచాటారు. విశేష ప్రతిభకనబరచి మంచి పతకాలను కైవశం చేసుకున్నారు. బెంగుళూరు కబ్బన్ పార్కులోని రాష్ట్ర లాన్‌టెన్నీస్ స్టేడియంలో జరిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ 25వ అఖిల భారత పోలీసు లాన్‌టెన్నీస్ 2024లో మన రాష్ట్రం నుండి టిటిడి విజిలెన్స్ విభాగం విజిఓలు నెట్టంతులసీవెంకట రామ్‌కుమార్ (డిఎస్పీ హోదా,వింగ్ విజిఓ), తిరుమల విజిఓ అల్లం సురేంద్ర పాల్గొన్నారు. వీరిద్దరూ జాతీయపోటీల్లో వెటరన్ డబుల్స్‌లో కాంస్యపతకం, ఓపెన్ టెన్నీస్ సింగిల్స్‌డబుల్స్ కేటగిరీలో కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనబరచి పతకాలు అందుకున్న విజిఓలు రామ్‌కుమార్,సురేంద్రను టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్‌ఓ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

## దర్శనం టిక్కెట్ ఉంటేనే వసతి

**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు దర్శన టిక్కెట్‌గానీ, టోకెన్ కలిగిఉంటేనే వసతి సౌకర్యం లభించనుంది. ఎటువంటి టిక్కెట్ లేకుండా తిరుమలకు వస్తే భక్తులకు గదులు ఇవ్వడం టిటిడి నిరాకరిస్తోంది. తిరుమలలో ఉన్న 7వేల గదులు మాత్రమే. రోజువారీగా లక్షమంది వరకు భక్తులు కొండకు చేరుకుంటున్నారు. సరాసరి 40వేలమంది భక్తులకు మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంది.

## దిశ ఏ దశలో ఉంది

-పార్లమెంట్‌లో ఎంపి గురుమూర్తి



తిరుపతి(రవాణా),డిసెంబర్ 3ప్రభాతవార్త:

సవరణల తరువాత కేంద్రప్రభుత్వానికి పంపిన ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు-2019 ప్రస్తుతం ఏ దశలో ఉందని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాల్లో మంగళవారం ఆయన దిశ బిల్లు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ సహాయ మంత్రి బండి సంజ్‌కుమార్ మాట్లాడుతూ సవరణ చేయబడిన ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు రాష్ట్రపతి పరిశీలన,అనుమతి కోసం స్వీకరించబడిందన్నారు. చట్టప్రకారం రాష్ట్రపతి ఆమోదంకోసం రాష్ట్రాల నుండి స్వీకరించబడిన బిల్లులు నోడల్ మంత్రిత్వశాఖలు,డిపార్ట్‌మెంట్‌లతో సంప్రదించి తదుపరి ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

## 6న స్కందషష్ఠి అభిషేకాలు



**తిరుపతి(రవాణా),డిసెంబర్ 3ప్రభాతవార్త:** తిరుపతినగరంలోని పల్లివీధిలో ఉన్న బాలసుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారికి 6వ తేదీ శుక్రవారం స్కందషష్ఠి సందర్భంగా ప్రత్యేక అబిషేకాలు, పూజలు జరుగుతాయని ఆలయ ఈఓ తెలిపారు. శనివారం 7వతేదీ మరోసారి స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు అలంకారం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గోని స్వామివారి పూజల్లో కృపకు పాత్రులు కావాలని కోరారు.

## తుఫాను ప్రభావంతో నీట మునిగిన పంటలు



**నగరి, డిసెంబరు 3 ప్రభాతవార్త:** తుఫాను ప్రభావంతో గత కొద్దిరోజులుగా కురిసిన భారీ వర్షాలకు అనేక చోట్ల పంటలు నీటమునిగాయి. కృష్ణారామపురం వద్ద కోతకు వచ్చిన వరిపంట నీట మునగడంతో ఒక పక్క తోటలో కొట్టిన చెరకు బయటకు రాని పరిస్థితిలో పొలం నిండా నీరు చేరుకుంది. ఇంకా వర్షం ప్రభావంతో చెరకు విత్తనాలు నాటిన పంటలు పూర్తిగా నీటమునిగాయి. మరి కొన్ని చోట్ల జొన్న, వరి పైర్లు పూలతోటలు, మిరపకాయ తోటలు గాలివానకు నేల రాలడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ తుఫాను కారణంగా అపార పంట నష్టం వాటిల్లింది.

## దివ్యాంగులపై శ్రద్ధ చూపాలి

వడమాలపేట, డిసెంబరు 3 ప్రభాతవార్త:



తల్లిదండ్రులు దివ్యాంగులపై శ్రద్ధ చూపాలని వడమాలపేట ఎంఈవో పద్మావతి తెలియజేశారు. వడమాలపేట మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తల్లిదండ్రులు దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వీరిని కూడా క్రమం తప్పకుండాపాఠశాలకు పంపించాలని, ప్రభుత్వం వీరికి అందిస్తున్నటువంటి సదుపాయాలన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో-2 తులసిరాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినకుమార్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు హేమలత, విజయకుమారి, ఫిజియోథెరపిస్టు నిరంజన్‌రెడ్డి, పాల్గొన్నారు.

## క్యాన్సర్‌ని ప్రాథమిక దశలో నిర్మూలించవచ్చు



సత్యవేడు, డిసెంబరు 3 ప్రభాతవార్త:

క్యాన్సర్‌ని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించడానికి సాధ్యపడుతుందని తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి అంకాలజీ వైద్యాధికారి ఏ.వి.చైతన్యభాను తెలిపారు. మంగళవారం సత్యవేడు మండలం రాచపాళెం గ్రామంలో జరిగిన ఉచిత క్యాన్సర్ స్కానింగ్ వైద్య శిబిరం సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రధానంగా క్యాన్సర్‌కి సంబంధించి మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాయశ ముఖ ద్వారా క్యాన్సర్, పురుషుల్లో నోటి క్యాన్సర్ అధికంగా వస్తున్నట్టు వైద్య పరీక్షల్లో గుర్తించడం జరిగిందన్నారు. మూడు, నాలుగు దశల్లో వ్యాధి తీవ్రతలు ఉన్నట్లయితే వైద్యచికిత్స ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చున్నారు. క్యాన్సర్ ఏ దశలో ఉన్న సిమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స నిర్వహిస్తున్నట్లు ఆమె గుర్తు చేశారు. ఏది ఏమైనా సమతుల్య ఆహారం, రేడియేషన్ బారిన పడకుండా ఉండడం, తగిన శారీరక వ్యాయామం అలవర్చుకోవడం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండొచ్చని ఆమె వివరించారు.

## శ్రీసిటీని సందర్శించిన బెలారస్ ప్రతినిధుల బృందం

సత్యవేడు, డిసెంబరు 3 ప్రభాతవార్త:



వ్యాపార పర్యటనలో భాగంగా బెలారస్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(బెల్‌సీసీఐ)ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. దయానా తురవా నేతృత్వంలో 14 మంది ప్రతినిధులు ఈ పర్యటనకు విచ్చేయగా, శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్(బిజినెస్ డెవలప్‌మెంట్) పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు పారిశ్రామిక అనుకూలతలు, ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు వలన కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ఈ పర్యటనపై హర్షం వ్యక్తం చేసిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, భారత్, బెలారస్ దేశాల మధ్య వ్యాపార బంధంమరింత బలపడేందుకు ఈ పర్యటన అత్యంత కీలకమైందిగా తన ప్రకటనలో పేర్కొన్నారు. బెలారస్ వ్యాపారవేత్తలు శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇది దోహదపడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

## బియ్యం అక్రమ నిల్వకేసులో దిలీప్‌రెడ్డి అరెస్టు

సత్యవేడు, డిసెంబరు 3 ప్రభాతవార్త: సత్యవేడు మండలం కొల్లడం ఎస్టీ కాలనీలో అక్రమంగా దాచి ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యానికి సంబంధించి నమోదైన కేసులో ప్రధాన నిందితుడు దిలీప్‌రెడ్డి(28)శ్రీసిటీ పోలీసులు అరెస్టు చేశారు. అక్రమ రేషన్ బియ్యం నిల్వపై సమాచారం అందడంతో నవంబరు 12న శ్రీసిటీ పోలీసులు కొల్లడంలో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో దీనిపై దర్యాప్తు ప్రారంభించిన శ్రీసిటీ పోలీసులు సూళ్లూరుపేట మండలానికి చెందిన ప్రధాన నిందితుడు దిలీప్‌రెడ్డిని అరెస్టు చేసినట్టు ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం 3600 కేజీలు ఉంటుందన్నారు. అరెస్టు చేసిన నిందితుడు దిలీప్‌రెడ్డిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు సూచనల మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ అక్రమ రేషన్ బియ్యం తరలింపు, నిల్వపై ఉక్కుపాదం మోపుతున్నారు.

# కోసలనగరంలో పారిశ్రామిక అభివృద్ధి చేయండి

– సీఎంకు విన్నవించిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



...వార్త: విజయపురం మండలంలో కోసలనగరాన్ని పారిశ్రామిక వాడగా ...ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం ...న్నవించారు. నగరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ...రు. పుత్తూరు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి స్థాయి 100 పడకలకు ...త్స చేసుకుని తమను ఆశ్రయించిన వారికి సీఎం సహాయ నిధి ...ర్గంలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై సీఎం ...పారు.

# 13న చొక్కాణి...15న గిరి ప్రదక్షిణం



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చొక్కాణి ఉత్సవాన్ని ఈ నెల 13న నిర్వహిం చుటకు సన్నాహాలుల చేపట్టినట్లు ఇఒ టి.బాపిరెడ్డి వివరించారు. ఆలయంలో ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. శివయ్యను అగ్నితో పూజించే విధానం ఉందన్నారు. అందుకు నిదర్శనమే 'చొక్కాణి' ఉత్సవం అని వివరించారు. శ్రీకాళహస్తిలో గిరి ప్రదక్షిణ గురించి విపులంగా వివరించి తానే స్వయంగా పాల్గొన్న చాగంటి కోటేశ్వరరావు శిష్యబృందంచే ఈ నెల 15న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణలు చేపట్టనున్నట్లు ఇఒ టి.బాబిరెడ్డి వివరించారు. గిరిప్రదక్షిణ సందర్భంగా ఏర్పాట్లును ఈ నెల 14న వేయిలింగాల కోనలో ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు ఇఒ తెలిపారు. 15న ఆదివారం పౌర్ణమి సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శిష్యబృందం శ్రీగురువాణి సొసైటికి చెందిన సుమారు 200 మంది గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని వివరించారు. ఈ మహత్తర కార్యక్రమంలో భక్తులు, శ్రీకాళహస్తిపట్టణ ప్రజలు పాల్గొనవచ్చునని ఇఒ బాపిరెడ్డి తెలిపారు.

**నేడు హుండీల లెక్కింపు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు నెల రోజుల పాటు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఒ బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 7గంటలకు గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. రోజు రోజుకు హుండీల ఆదాయం పెరుగుతుందని వివరించారు. విధులనుకేటాయించిన సిబ్బంది నిబంధనలను పాటిస్తూ పాల్గొనాలన్నారు.

# కోనేరు చుట్టూ వాహనాల పార్కింగ్



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న జయరామారావు వీధిలోని వైష్ణవ కోనేరు చుట్టూ వాహనాలు పార్కింగ్ చేయటంతో రాకపోకలకు అంతరాయం కల్గుతుంది. పురాతన కాలం నాటి కోనేరును 1994లో జీర్ణోద్ధారణ గావించారు. శిధిలమైన కోనేరులను జీర్ణోద్ధారణ గావించారు. అందంగా తీర్చి దిద్ది, రక్షణగా గోడలను నిర్మించారు. అయితే జయరామారావు వీధిలోని వైష్ణవ కోనేరు దక్షిణ భాగాన ఆర్అండ్‌బి ప్రధాన రహదారి ఇక్కడ నుంచి తిరుపతి వైపు వెళ్ళే బస్సులు, తమిళనాడు నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే కార్లు పయనిస్తుంటాయి. రోడ్డు అవతల వ్యాపార సంస్థలు, తూర్పున నివాస గృహాలున్నాయి. పడమర ఓ ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన గోదాము. ఉత్తరాన విద్యాసంస్థలు ఉన్నాయి. తూర్పున ఇరుకు రోడ్డు, ఉత్తరాన కోనేరు గోడ,రోడ్డు మధ్య స్థలంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు పార్కింగ్ చేస్తున్నారు. తూర్పున ఓ వైపు రోడ్డు శీతలలాంబ ఆలయం గ్రామ దేవత ఆలయం ఉంది. అయితే ఇక్కడ నిబంధనలకు వ్యతిరేకంగా పార్కింగ్ చేసుకుంటున్న వారిపై ఎవరు చర్యలు తీసుకోవాలన్నది ప్రశ్నార్థకమైంది. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు కోనేరు చుట్టూ పార్కింగ్‌లపై దృష్టి సారించాల్సి ఉంది.

# అతివేగం నిండుప్రాణాన్ని బలిగొంది!



**శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** భార్యను పుట్టింటికి కాన్పుకు చేర్పించి తాను తిరిగి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ఏర్పేడు–వెంకటగిరి మార్గంలోని టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.ఖమ్మం జిల్లా పెద్దిరెడ్డి గూడెం బ్రాహ్మణపల్లికు చెందిన బి.మహేష్ తనయుడు బి.అనుప్(32) తిరుపతిలో మనువాడాడు. భార్య గర్భవతి కావటంతో కాన్పుకు పుట్టింటికి పంపారు.ఆమెను చూడటానికి తన సొంత కారు టిఎస్ 07 హెచ్‌వి 9963 టాటా అట్లాస్‌లో తిరుపతికి వచ్చారు. మంగళవారం తిరుగుపయనమయ్యాడు. ఏర్పేడు నుంచి వెంకటగిరి మార్గంలో వెళుతుండగా చింతలపాళెం వద్ద ఉన్న టోల్‌ప్లాజా దగ్గర అతివేగంగా కారు నడుపుతుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. అతివేగంగా కారు నడుస్తుండటంతో డివైడర్‌ను ఢీకొనటంతో కుడిపైపు(డ్రైవింగ్' కారు నుజ్జు నుజ్జు అయ్యింది.కారున దుపుతున్న బోనుపల్లి అనుప్ అక్కడిక్కడే మృతి చెందారు.పోలీసులు కేసు నమోదు చేసి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.సంఘటన సమాచారం తెలిసిన వెంటనే తిరుపతిలోని బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.శోక సముద్రంగామారింది.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** ఏర్పేడు–వెంకటగిరి మార్గంలోని పల్లం పేటలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముచ్చివోలుకు చెందిన వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చివోలుకు చెందిన సప్పిడి చిన్న సుబ్బరామిరెడ్డి(58) మంగళవారం పల్లం పేటకు వెళ్ళి ఇంటికి కావాల్సిన నిత్యావసర సరకులు కొనుగోలు చేసుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా తిరుపతి నుంచి ఉదయగిరికి వెళ్ళు ఉదయగిరి ఆర్‌టిసి డిపో బస్సు ఢీకొంది. దాంతో సుబ్బరామిరెడ్డి అక్కడి కక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుప్రతికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బాడీ బిల్డింగ్‌లో ద్వితీయ బహుమతి



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** తిరుపతిలో నిర్వహించిన అంతర్ జిల్లా బాడీ బిల్డింగ్, ఉత్తమ శారీర ఆకృతి పోటీలలో శ్రీకాళహస్తికి చెందిన యువకుడు ఎస్‌కె జావిద్(27) విశేష ప్రతిభ కనబరచి ద్వితీయ బహుమతి సాధించారు. పోటీలలో బాడి బిల్డింగ్ మరియు ఉత్తమ శరీర ఆకృతి పోటీలలో ద్వితీయ బహుమతిని పాధించి వెండి పతకాన్ని సాధించారు. ఇందులో శ్రీకాళహస్తిలోని సచివాలయ ఉద్యోగి జావిద్ బహుమతి సాధించటమే కాకుండా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసారు. ఆతను జాతీయ స్థాయికి ఎదగాలని ప్రశంసించారు.

# సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



**తొట్టంబేడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాసారం ప్రాధమిక వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆశా దినోత్సవం సందర్భంగా వాతావరణ మార్పులు వల్ల వర్షాల వల్ల ఎక్కువగా ఉండడంతో సీజనల్ వ్యాధులపై ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు సంఖ్య ఎక్కువగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులపట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ సీజనల్‌లో వైరస్ ఇన్‌ఫెక్షన్‌వల్ల రకరకాల వ్యాధులు పెరుగుతాయన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సబ్‌సెంటర్‌లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పిలు ఏఎన్ఎంలు,ఆశావర్కర్లతోమందులనుపంపిణీచేయాలనిఆదేశించారు.ఇంటింటాసర్వేచేసి చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రోత్సహిస్తే ప్రతిభ చాటుతారు...ఎంఈవోలు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 3 ప్రభాతవార్త :** దివ్యాంగులైన పిల్లలకు తగిన ప్రోత్సాహం అందిస్తే సాధారణ పిల్లలకు ఏమాత్రం తీసిపోరని మండల విద్యాశాఖ అధికారులు భువనేశ్వరి, బాలయ్యలు అన్నారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో దివ్యాంగులు 10శాతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీనిని తగ్గించాలంటే మేనరిక వివాహాలు, బాల్య వివాహాలు నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు జనార్ధన్, మజ్ను, వరలక్ష్మి, ఉపాధ్యాయులు సుకన్య, సిఆర్ఎంటీలు మునిమోహన్, లలిత పాల్గొన్నారు.

# ఘనంగా బాబు రాజేంద్రప్రసాద్ జన్మదినవేడుకలు



**తొట్టంబేడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :** పట్టణంలోని బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతిని ఏపిజె అబ్దుల్‌కలాం స్కౌట్ ట్రూప్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా స్కౌట్స్ యువజన విభాగ ఛైర్మన్ షేక్ అజారుద్దీన్ బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్ఞానప్ప, స్కౌట్స్ మాస్టర్ యోగానంద, స్కౌట్ లీడర్ మునిరాం, సాయి, కిరణ్, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కనువిందు చేస్తున్న హర హర తీర్థం...

తొట్టంబేడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలో ఉన్న దేవుని బాటలో కొండల్లో వెలసిన హర హర తీర్థంలో నుంచి జలపాతం పర్యాటకులను సందడిచేస్తోంది. కొండకోనల్లో నుంచి వచ్చే జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పర్యాటకులు ఈవైపుగా వచ్చి నీటిలో సందడి చేస్తున్నారు. దీన్నే పనసకోన అంటారు. ఇక్కడ ఆలయ తరపున శివపార్వతుల ఆలయాన్ని నిర్మించనున్నారు. అయితే ఎలాంటి ప్రమాదం లేకుండా పోలీసులు ఇక్కడ చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది.

# కొట్టుకుపోయిన బ్రిడ్జి...నిర్మాణానికి చర్యలు : ఎంఎల్‌ఏ పులివర్తి



చంద్రగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త: గత ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలనలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బ్రిడ్జి పునర్నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నట్లు ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. ఏ.రంగంపేట–ఐతేపల్లి మార్గంలోని పులివర్తివారిపల్లి వద్ద స్వర్ణముఖీ నదిపై నిర్మించిన వంతెన కొట్టుకుపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరదలు పోటెత్తడంతో ప్రజల రాకపోకలకు విఘాతం ఏర్పడింది. ఈ నేపధ్యంలో విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఏ మంగళవారం సంఘటనా స్థలికి చేరుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అధికారులను ఆదేశించారు. వరదలకు కొట్టుకుపోయిన వంతెనల పునర్నిర్మాణాలను రెండేళ్ళలో పూర్తి చేస్తానన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు సుమారు రూ.14.60 కోట్లుతో ప్రతిపాధనలు ప్రభుత్వానికి అందజేసినట్లు వివరించారు. వరత తీవ్రత పరిశీలనకు ఎంఎల్‌ఏ వెంట ఎంపిటిసి ఏసి శేఖర్, టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, ఉస్మాన్, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగు ధీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి..!



**చంద్రగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** వికలాంగుల ధీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని పట్టెడన్నం సేవా సమితి దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ ప్రభుత్వాన్ని కోరారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం టవర్ క్లాక్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు అందవలసిన ప్రభుత్వ సంక్షేమ పధకాలను సకాలంలో అందించడం లేదన్నారు. దివ్యాంగులకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉషారాణి, సునీత, సుజాత, దమ్ము రాయుడు, డి.సునీత, గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నాగాలమ్మ ఆలయంలో స్వార్ధపరుడి తిష్ట!

పూజల పేరిట భక్తుల నుండి దోపిడి : జడ్పీటిసి చిల్లకూరి ఆరోపణ



చంద్రగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త: చంద్రగిరి ప్రజల ఆధ్మాత్మిక చింతనలో విశ్వాస పాత్రమైన నాగాలమ్మ ఆలయంలో స్వార్ధపరుడు తిష్ట వేశాడని జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్‌రెడ్డి అన్నారు. చారిత్రాత్మక నేపథ్యం కలిగిన నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల పేరిట భక్తులను నిలువుదోపిడికి గురిచేస్తున్నట్లు దుయ్యబట్టారు. ఈ ఆలయం వున్న భూమి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సతీమణి సునంద పేరిట 2010లో రిజిస్ట్రేషన్ చేయబడినట్లు తెలిపారు. అయితే గత కొంత కాలంగా ఒంటి శివశంకర్‌రెడ్డి ఆలయ అభివృద్ధి కమిటీ పేరిట అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై విజయసాయిరెడ్డి సూచనలతో పోలీసులకు ఫిర్యా చేసినట్లు తెలిపారు.

# దివ్యాంగులను ఆధరించండి..! : ఎంఈఓ



చంద్రగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త: దివ్యాంగులను ప్రేమతో ఆధరించి అక్కున చేర్చుకోవాలని ఎంఈఓ మార్కొండేయ నాయుడు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం మిట్టూరు భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలలకు పంపి వారి విద్యాభివృద్ధికి దోహదపడాలన్నారు. వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, రవాణా ఖర్చులు, తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 జయవేలు, హెచ్ఎం వాగ్దేవి, ఐఆర్‌టి మనోహార్, తదితరులు పాల్గొన్నారు.

# జన్మస్థల శివాలయాన్ని పరిశీలించిన తహశీల్దార్



**రామచంద్రాపురం, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** మండలంలోని రేకలచేను సమీపంలో గల జన్మస్థల శివాల యాన్ని మంగళవారం తహశీల్దార్ వెంకట రమణ పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన కొంత మంది జన్మస్థల శివాలయం పేరిట ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహశీల్దార్ శివాలయానికి వెళ్ళి ఇరువర్గాలతో సమక్షం లో విచారణ జరిపారు. ఇరు వర్గాల వాదనలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రమేష్‌బాబు, ఆర్ఐ లక్ష్మినారాయణ, విఆర్ఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుల ప్రతిభ



**తిరుపతి విద్య డిసెంబర్ 3 ప్రభాతవార్త:** ఎస్వీయూ పరిధిలోని అంతర్ కళాశాలల డిగ్రీ అధ్యాపకులకు నిర్వహించిన పలు క్రీడా పోటీలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు.కళాశాలకు చెందిన అధ్యాపకులు డాక్టర్ ముస్తాక్ అహ్మద్ బాల్ బ్యాట్మింటన్ సింగల్ విజేతగాను,డబుల్స్ విభాగంలో ముస్తాక్ అహ్మద్ ,డి ప్రభాకర్ రన్నర్స్ గాను టేబుల్ టెన్నిస్ సింగల్ విభాగంలో డాక్టర్ కిరణ్ కుమార్ రాజు ఎం వాణి, శిల్ప, మహితా రాణి,డాక్టర్ పూర్ణిమ,బి శ్రీదేవి త్రో బాల్ నందు విజేతలుగా గెలుపొందారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరుడు,భీమన్న తదితరులు అధ్యాపకులను అభినందించారు.

# కాలుష్యం అనర్ధాలపై విద్యార్థులకు అవగాహన



**కేవీబీపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త:** జాతీయ కాలుష్య దినోత్సవం సందర్భంగా కేవీబీ పురం మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూలు విద్యార్థులకు కాలుష్యం వలన కలిగే అనర్థాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట కృష్ణయ్య, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు కాలుష్య నివారణకు దోహదపడాలన్నారు. భక్తిభావన, శిక్షణతో విద్యార్థులు విద్యను ఆర్జించే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. సమావేశంలో అక్కుపల్లి లక్ష్మిప్రసాద్, సైన్స్ టీచరు గంగోటి, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైసీపీనాయకులు



**కేవీబీ పురం, డిసెంబరు 3 ప్రభాతవార్త:** మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా ఎన్నికైన సందర్భంగా కేవీబీపురం మండలం వైసీపీ నాయకుడు గవర్ల కృష్ణయ్య ఆయనను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్ధిలో నైపుణ్యానికి గుర్తించాలి : ఎంపీడీవో

**పుత్తూరురూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** విద్యార్థుల నైపుణ్యాన్ని వెలుగులోకి తీయడం ఉపాధ్యాయులు బాధ్యతని పుత్తూరు మండల అభివృద్ధి అధికారి రమేష్‌బాబు తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పుత్తూరు భవిత కేంద్రంలో ఎంపీడీవో, ఎంఈవో తిరుమలరాజు, ఎంఈవో–2 ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌వి సూర్యకుమారి, ఆనంద్, జగదీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంపీయూపీ మెయిన్ స్కూలు ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్ ఎన్నిక



**పుత్తూరురూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** సీపీఎం పార్టీ 14వ జిల్లా మహాసభలు సత్యవేడులో 1,2 తేదీల్లో మస్తాన్ కల్యాణ మండపంలోజరిగిన ఈ మహాసభల్లో గత మూడు సంవత్సరాల పోరాటాలను సమీక్షచేసి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించి ఈ జిల్లా మహాసభకు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తిరుపతి జిల్లా సీపీఎం పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పుత్తూరు పట్టణానికి చెందిన ఆర్.వెంకటేష్‌ను సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# దుస్థితిలో గ్రామీణ రోడ్లు

**విజయపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త:**

మండలంలో గ్రామీణ రోడ్లు దుస్థితికి చేరుకుంది. సంవత్సరాల తరబడి రోడ్డు మరమ్మతుకు నోచుకోకపోవడం రోడ్లు అధ్వానంగా తయారైంది. నాలుగు రోజులు పాటు కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దుస్థితికి చేరుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరి నుంచి విజయపురం వెళ్లడానికి దేశమ్మగుడి నుంచి కాళికాపురం, గంగమాంబా పురం, ముత్యాలరెడ్డి కండ్రిగ, మంగళం మీదుగాఎక్కువ మంది ప్రయాణం చేస్తూ ఉంటారు. రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో ఎప్పుడు ఎక్కడ ప్రమాదంజరుగుతుందో తెలియడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# తిరుపతి డివిజన్

## టిడిపి సభ్యత్వం భవిష్యత్తుకు భరోసా

**తిరుపతి హెల్త్, డిసెంబర్ 3, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో ప్రతి కార్యకర్త భవిష్యత్తుకు మంచి భరోసా లభిస్తుందని ముత్యాలరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచి మమత అన్నారు. మంగళవారం తిరుపతి నగర పాలక సంస్థ పరిధి ఎల్ ఎస్ నగర్‌లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకురాలు మమత తెలుగుదేశం పార్టీ సభ్యత్వం వలన కలిగే మేలును ప్రతి కార్యకర్తకు వివరిస్తూ ఎంతో ఉత్సాహంగా సభ్యత్వ నమోదును చేయించారు. ఈ సభ్యత్వ నమోదుటిడిపినాయకులురమేష్,సురేష్,సతీష్, రాజా, పునీత్ పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఫెంగాల్ తుఫాన్ ప్రభావం పొంగిపోరలిన మద్దిలవంక

– రాకపోకలకు తీవ్ర అంతరాయం



**వెదురుకుప్పం,డిసెంబర్ 3 ప్రభాతవార్త :** ఫెంగాల్ ప్రభావం వలన చెరువులు, కాలువలు, పొంగిపొరలడంతో తంగేళ్ళిమిట్ట సమీపంలోగల మద్దిలవంక ఉధృతిగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. తుఫాన్ ప్రభావం వలన మండలంలో గత మూడు రోజులుగా విస్తరంగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలలో నీటి మట్టం పెరిగి ప్రవాహం పుంజుకుంది. ఈ క్రమంలో మారేపల్లె సమీపంలో నిర్మించిన మద్దెమానుమందుగు ప్రాజెక్టుకు వర్షపు నీరు చేరి మొరవ ప్రవాహం ఎక్కువ కావడంతో మద్దిల వంక వద్ద రోడ్డు పై ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో చిత్తూరు. తిరుపతి వయా దేవళంపేట మీదుగా వెళ్ళు వాహనాలు ప్రయాణించడం కష్టతరమైయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడవలసి వచ్చింది. బస్సులు ఆగిపోవడంతో ప్రయాణికులు తమ ప్రయాణంను వాయిదా వేసుకోవలసివచ్చిందన్నారు. అత్యవసర సేవలకు ఇబ్బందులు తప్పలేదు. మద్దిల వంక ఎత్తు పెంచకపోవడం వలన సమస్యలు వస్తున్నాయని ప్రయాణికులు వాపోయారు. వర్షాలు కురిసిన సమయంలో కష్టలు తప్పడంలేదని ప్రస్తుత ప్రజాప్రతినిధులైన పట్టించుకుని శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## శిథిలావస్థకు చేరుకున్న వైద్యభవనాలు - ఇబ్బందుల్లో సిబ్బంది,రోగులు

**కార్వేటినగరం,డిసెంబరు 3,ప్రభాతవార్త:**



కార్వేటినగరం సామాజిక ఆరోగ్యకేంద్రం భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వైద్యబృందం,రోగులు ఇబ్బందులు పడ్డారు.సామాజిక ఆరోగ్యకేంద్రంలో గల గోడలు భారీ వర్షాలకు తడిసిముద్దవడంతో గోడలు కూలుతున్నాయి.అంతేకాకుండా గోడలకు విద్యుత్ ప్రసరణ జరుగుతుండడంతో గమనించిన వైద్యులు భయభ్రాంతులకు గురై వేరే భవనంలో వైద్య చేస్తూ రోగులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.కార్వేటినగరంలో 50పడకల ఆసుపత్రి కోసం గత రెండేళ్ళ క్రితం నూతన భవనం ప్రారంభించారు. అయితే ఇంత వరకు పూర్తి కాకపోవడంతో రోగులు,వైద్యులు పాత భవనంలోనే వైద్యం అందించే పరిస్థితి ఏర్పడింది.కాగ జిల్లా అధికారులు,అనధికారులు స్పందించి నూతన వైద్యభవనాన్ని పూర్తియ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## కృష్ణాపురం జలాశయం గేట్లు ఎత్తివేత - లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తం

**కార్వేటినగరం,డిసెంబరు 3 ప్రభాతవార్త:**



కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయంలోని గేట్లు ఎత్తివేయడంతో దిగువనున్న లోతట్టు ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు కోరుతున్నారు. గత మూడు రోజులుగా పెంగల్ తుఫాను ఉధృతంగా కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి నీటి ఉధృతి అధికం కావడంతో కొన్ని గంటల పాటు గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు అంటున్నారు. ఇరిగేషన్ అధికారులు గేట్లు ఎత్తివేయడంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## బంగారమ్మకు ప్రత్యేపూజలు

**కార్వేటినగరం,డిసెంబరు 3 ప్రభాతవార్త:**

కార్వేటినగరం గ్రామదేవతయిన బంగారమ్మ ఆలయంలో జాతర సందర్భంగా మూడవ మంగళవారం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.తెల్లవారి జామున బంగారమ్మ ప్రతిమకు పాలు,పెరుగు, చందనం,పసుపు,కుంకుమ,నారికేళం,మకరందంలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు ,ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు.ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.కార్యక్రమంలో ఆలయఅధ్యక్షులు కొప్పేటిప్రసాద్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఘంటశాల జయంతిని పురస్కరించుకుని పుష్పాంజలి

**తిరుపతిరూరల్,డిసెంబర్03 ప్రభాతవార్త:**

పద్మశ్రీ ఘంటశాల 103వ జయంతిని పురస్కరిచుకుని బుధవారం రాత్రి 7గంటలకు పుష్పాంజలి ఘటిస్తున్నట్లు ఘంటశాల గాన కళాపదం అధ్యక్షులు మల్లం విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వి.వి.మహల్ రోడ్డు కూడలిలో ఉన్న ఘంటశాల విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పిస్తున్నామని, అందర్దూ ఆహ్వానితులేనని తెలిపారు.

## పేరూరు చెరువుకు ఎమ్మెల్యే పులివర్తి నాని జలహారతి



**తిరుపతిరూరల్,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** పేరూరు చెఱువుకు పుష్కలంగా నీరు చేరడంతో పేరూరు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పేరూరును ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. నిండు కుండలా తలపించే చెరుకు ఎమ్మెల్యే నాని పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. ప్రతి ఏడాది పేరూరు చెఱువు నీటితో నిండి, ప్రజల దాహార్తిని తీర్చాలని ఆకాంక్షించారు. ఇటీవల కురిసిన వర్షాలకు స్వర్ణముఖి నుండి పేరూరు చెఱువుకు నీళ్ళు సప్లయ్ చేసే కాల్వల్లో పూడికతీయడంతో నీరు పుష్కలంగా చెఱువుకు చేరుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో చంద్రగిరి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందడం ఖాయమని జోస్యం పలికారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే నాని మరోసారి స్పష్టం చేసారు. గత ప్రభుత్వం చెరువులను, అనుబంధ కాల్వలను అభివృద్ధిపై ఏ మాత్రం దృష్టి పెట్టకుండా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రావడంతో చెరువుకు, కాల్వలకు మహర్ధశ వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు, నాగూరు శ్రీనివాసులు, కాయం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఓటేరులో బాల్య వివాహాలకు వ్యతిరేక ర్యాలీ

**తిరుపతిరూరల్,డిసెంబర్3 ప్రభాతవార్త:**

తిరుపతిరూరల్ మండలం ఓటేరు గ్రామ పంచాయతీలో బాల్య వివాహాలకు వ్యతిరేక ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఏపిఎం నాగేశ్వరరావు తెలిపారు.

## గంజాయి రహిత సమాజస్థాపనకు సహకరించండి



**నారాయణవనం, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** గంజాయి రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, స్థానిక ఎస్సై కె.రాజశేఖర్‌లు కోరారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గంజాయి పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి కృషి చేస్తోందని గుర్తు చేశారు. ఈమేరకు మండలంలో కూడా యువత తల్లిదండ్రులు అవగాహన కలిగి గంజాయిని పూర్తిస్థాయిలో అరికడతామన్నారు. ఇప్పటికే తిరుపతికి చెందిన వెంకటేష్(47) అనే గంజాయి సరఫరాదారున్ని పట్టుకుని జైలుకు కూడా పంపామన్నారు.

## ఎస్వీయూలో అంతర్జాతీయ తెలుగు భాషోత్సవాలు



**తిరుపతి విద్య డిసెంబర్ 3 ప్రభాతవార్త:** తెలుగు భాషా పరిరక్షణే ధ్యేయంగా ఫిబ్రవరి 27వ తేదీ నుంచి ఎస్వీయూలో అంతర్జాతీయ తెలుగు భాషోత్స వాలను నిర్వహించనున్నారు.తెలుగు అధ్యయన విభాగం, ప్రాచ్య పరిశోధనా సంస్థ,బెంగళూరుకు చెందిన తెలుగు సంపద సంస్థలు సంయుక్తంగా ఈ ఉత్సవాలను రెండు రోజులపాటు నిర్వహించనున్నారు.ఈ మేరకు ఉత్సవ ప్రచార పోస్టర్లు ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో వస్తున్న అనేక మార్పుల కారణంగా భాష,సాహిత్య రంగాల్లోనూ మార్పు చేర్పులు అవసరమన్నారు.సాహిత్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవలసిన అవసరం ఉందన్నారు.తెలుగు పరిశోధకులు, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి అధ్యాపకులు,సాహిత్యభిమానులు ఈ సదస్సులో పరిశోధన పత్రాలను సమర్పించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆర్ రాజేశ్వరమ్మ,ఓఆర్ డైరెక్టర్ వీసీ వెంకటేశ్వర్లు,డిఓఏ డైరెక్టర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

# వరద ముంపులో వరి పంట / - వర్షం ఆగినా తగ్గని ముప్పు



సూళ్లూరుపేట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పంట ఇప్పటికీ వరద ముంపులోనే ఉంది. సూళ్లూరుపేట మండల పరిధిలోని కాళంగి నది, పాముల కాలువ, పుచ్చా కాలువ, నెర్రికాలువ, దొండ కాలువ, మల్లి కాలువలు పొంగి ప్రవహించడంతో పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ నీట మునిగాయి. కొన్ని చోట్ల వరిపైరు వరద నీటిలో ముంపునకు గురికాగా, మరికొన్ని చోట్ల వేసిన వరినాట్లు నీట మునిగి పాచిపోయే దశకు చేరుకున్నాయి. సోమవారం నుంచి వర్షం తెరపి ఇచ్చినప్పటికీ పంట పొలాల్లో నీరు చేరుకొని రైతులకు నష్టం చేకూర్చుతోంది. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం సూళ్లూరుపేట మండలంలో సుమారుగా 1317 ఎకరాలు వరద నీటి ముంపునకు గురైనట్లు తెలుస్తోంది. మండలంలోని పడమటికండ్రిగ, ఎన్‌వి కండ్రిగ, జిఎన్‌టి రోడ్డు పరివాహక ప్రాంతంలోని గోకులకృష్ణ కాలేజి సమీపంలో, పిండిపాలెం, వట్రపాలెం వద్ద పంట పొలాలు నీట మునిగి ఉన్నాయి. అలాగే పడమటి పల్లెల్లోని మంగళంపాడు, ఉగ్గుముడి, దామానెల్లూరు తదితర ప్రాంతాల్లో రైతులు వేసిన వేరుశనగ, మిరప రైతులకు వాటిల్లిన నష్టం తక్కువే అని అధికారులు చెప్పున్నప్పటికీ, రైతులు మాత్రం తాము వేలాది రూపాయలు వ్యయం చేశామని ప్రస్తుతం ఈ పంటలు కన్నీళ్లు మిగుల్చుతున్నాయని వాపోతున్నారు. 15 హెక్టార్లలో మిరప, 10 హెక్టార్లలో వేరుశనగ దెబ్బతిని ఉండొచ్చని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వరద ప్రభావిత ప్రాంతాల్లోని పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రత్యేక బృందాల ద్వారా పంట నష్టాన్ని అంచనా వేసి తుది నివేదిక ప్రభుత్వానికి పంపి తగు చర్యలు తీసుకొని రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు సానుకూలంగా వ్యవహరించి త్వరితగతిన అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తే తాము తిరిగి వరి పైరు, ఇతర పంటలు వేసుకునేందుకు వీలవుతుందని రైతులు అంటున్నారు.

# గూడూరు డివిజన్

## ఇంటింటా సర్వేపై సమీక్ష

కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలంటే ప్రతి ఇంటిని సచివాలయ ఉద్యోగులు జల్లెడపట్టే విధంగా సర్వే నిర్వహించాల్సి ఉందని డిఎల్‌డిఒ వాణిరెడ్డి చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని కేశవరం, కోట సచివాలయాల్లో ఇంటింటా సర్వేపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సర్వే ఎంత మేరకు పూర్తయింది, ఎంతమంది లబ్ధిదారులు ఊళ్లకు వెళ్లారు, ఊళ్లకు వెళ్లి వచ్చిన వెంటనే ఆ ఇళ్లను జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపిడిఒ వేణు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## కోటలో దివ్యాంగుల దినోత్సవం

కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : కోటలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి భరత్ కమల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు తమ వైకల్యాన్ని ఓడించి జీవితంలో సాధిస్తున్న విజయాలను మిగతా వారికి స్ఫూర్తిగా తీసుకునే రోజులు వచ్చాయన్నారు. అనంతరం ఎంఇఒ-2 మస్తానయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేక సంరక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## చినుకు రాలింది... రోడ్డు చెరువైంది



కోట,డిసెంబర్ 3 ప్రభాతవార్త : చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ చెరువులుగా మారుతున్నాయి. సరైన మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో కోట, విద్యానగర్‌లో మోకాలిలోతు నీటిలోనే చోదకులు రాకపోకలు సాగిచాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలయమయ్యాయి. రోడ్లన్నీ చెరువులుగా మారాయి. కోట నుంచి క్రాస్ రోడ్డు వరకు రోడ్డు పరమ అధ్వానంగా ఉండటంతో ప్రజలు నరకాన్ని అనుబవిస్తున్నారు, ఏన్నో ఏళ్ల గా ఈ సమస్యను అధికారులు పట్టించుకొవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలు అధికారులు పట్టించుకొకపోవడంపై ప్రజలు ఆర్‌అండ్ బి అధికారులు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి



చిట్టమూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : చిట్టమూరు మండలంలో తుపాను తాకిడికి నీట మునిగిన పంట పొలాలను మంగళవారం నాయుడుపేట సబ్ డివిజన్ ఉపసంచాలకులు, చిట్టమూరు వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ పరిశీలించారు. చిట్టమూరు మండలం అరవపాలెం గ్రామంలో వరదల ఉధృతికి వందలాది ఎకరాలు నీటిలోనే ఉన్నాయని తెలుసుకున్న ఆయన స్థానిక వ్యవసాయ సహాయకులు సునందతో కలిసి నీట మునిగిన వరినాట్లను పరిశీలించారు. ఆయన రైతులకు సూచనలు చేస్తూ, వరినాట్లు వేసిన రైతులందరూ నీటి నిల్వలను తగ్గించుకొని ఎకరాకు 25 కేజిల పొటాష్, 20 కేజిల యూరియాలను చల్లుకోవాలన్నారు. అలాగే కార్బండిజం ఎకరాకు 500 గ్రాములుతో పాటు ఎస్పేట్ 300 గ్రాములు కలిపి పిచికారి చేసుకుంటే ఫలితాలు ఉంటాయని తెలిపారు.

## తడలో అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం



తడ, డిసెంబర్ 3 ప్రభాతవార్త : తడలో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు గురించి పలువురు వివరించారు. ఫిజియోథెరపిస్ట్ శిరీష పిల్లలతో పాటు తల్లిదండ్రులకు కూడా సూచనలిచ్చారు. ఇక్కడ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, కల్పన, ప్రియాంక, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి పార్టీకి రాజీనామా చేసిన దేవికా



బాలాయపల్లి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం పర్సన్ పదవికి దేవికా చౌదరి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షులకు పంపినట్లు ఆమె వివరించారు. వ్యక్తిగత కారణం వల్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆమె తెలిపారు.

## అన్ని రంగాల్లో రాణిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతుల : ఎంఈఓ



వెంకటగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : నేడు ప్రత్యేక ప్రతిభావంతుల అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎంఈఓ తోట వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ రోటరీ క్లబ్ మరియు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ను భవిత స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.కె.ప్రసాద్, ముఖ్య అతిథులుగా ఎంఈఓలు టి.వెంకటేశ్వర్లు, సి.బాబయ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతుల చిన్నచూపు చూడరాదని తెలిపారు. ప్రత్యేక ప్రతిభావంతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.కె.ప్రసాద్ వివరించారు. డాక్టర్ శేషు మాట్లాడుతూ అధైర్య పడకుండా అన్ని రంగాలలో రాణించాలనిచాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కటారి జానకిరామ్, డాక్టర్ వెంకట శేషయ్య, ఐ.ఈ.ఆర్.టి. ఉపాధ్యాయిని శోభారాణి, ఫీజియోథెరపి డాక్టర్ మమతా, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు మల్లమ్మ, పాస్ట్ ప్రెసిడెంట్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 6న మండల పరిషత్ కార్యాలయ ప్రారంభం



వెంకటగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : వెంకటగిరి పట్టణంలో రూ.1 కోటి 60 లక్షల రూపాయలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయం ఈ నెల 6న రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ, వెంకటగిరి శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభిస్తారని ఎంపిడిఓ కే.కోటేశ్వరరావు, ఎంపిపి తంబిరెడ్డి తనూజారెడ్డిలు తెలిపారు.

## ప్రత్యేక ప్రతిభావంతుల అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుంది



బాలాయపల్లి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : బాలాయపల్లిలో ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్స వం సందర్భంగా భవిత పాఠశాలలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు కిల్లా వెంకటేశ్వర్లు, బి.ప్రదీప్ కుమార్, ఐ.ఈ.ఆర్.టి.ఉపాధ్యాయిని వాసవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ కిల్లా వెంకటేశ్వర్లు ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పలు పథకాలను వివరించారు. పలు పోటీలలో నైపుణ్యం కనబర్చిన విద్యార్థులకు విద్య సామాగ్రి, బహుమతులు పంపిణీ చేశారు.

## రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం



గూడూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసేబులెడ్(రెడ్) సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక పాదిమంజిల్ నందు ప్రత్యేక ప్రతిభావంతుల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గూడూరు ఏరియా హాస్పిటల్ సూపరింటె ండెంట్‌షేరీన్, గూడూరు రైల్వే కమర్షియల్ సూపర్డె ంట్ అరేటి వెంకటేశ్వర్లు , రెడ్ గౌరవ అధ్యక్షులు మనపాటి రవీంద్ర బాబు, ఏపీజీబీ కోఆర్డినేటర్ గురుస్వామి, శ్రీ కృష్ణ సేవ సమితి అధ్యక్షులు మయూరి శ్యామ్ యాదవ్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు ఆరవ పర్వతయ్య, మహబూబ్ బాషా, నయోమి, దాతలు నితీష్ ,అదంకి లక్ష్మి ఇంక రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, రాజష్, శ్రీధర్, రామలింగం, పల్లం వెంకటేశ్వర్లు, జమీర్, శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

## రోటరీ వెస్ట్ క్లబ్‌చే ఫల సరుకులు పంపిణీ



గూడూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్ నందు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి దాతృత్వంతో ఫల సరుకులు, దుప్పట్లను క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు, సీనియర్ రొటేరియన్ కంటి రామ్మోహనరావు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చోళవరం గిరిబాబు, బండి ధనుంజయరెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డి, మోలే హరినాథ్‌రెడ్డి, నాగరాజురెడ్డి, సనత్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, కోట కృష్ణ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతకు గుండెకోత



కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : ఫెంగల్ తుపాను ప్రభావంతో కోట మండలంలో నాలుగు రోజులుగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలు రైతులకు తీవ్ర నష్టం కలిగించాయి. మండలంలోని వందలాది ఎకరాల్లో వరినాట్లు, నారు మడులు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో నీరు బయటకు పంపే అవకాశం లేకపోవడ ంతో అన్నదాతలు మునిగిపోయిన వరినాట్లు చూస్తూ కన్నీరుపెడుతున్నారు. అల్లంపాడు, ఊనుగుంట పాలెం, తిన్నెలపూడి, రుద్రవరం, చిట్టేడు, వంజివాక, వెంకన్నపాలెం, కొత్తపాలెం, జరుగుమల్లి తదితర గ్రామాల్లో 650 హెక్టార్లు వరినాట్లు మునిగిపోయాయి. 60 శాతం నీళ్లు పంట పొలాల్లో ఉండిపోయాయి. మళ్లీ నారు పోసుకోవాలంటే అప్పు చేయకతప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 10 వేల రూపాయలు నష్టం వాటిల్లుతుందని, మళ్లీ విత్తనాలు వేయాలంటే కనీసం నెలరోజులు సమయం పడుతుందని, అప్పటికి అదునుదాటి దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఇప్పటికీ చెరువుల్లాగానే పంట పొలాలు



తడ, డిసెంబర్ 3 ప్రభాతవార్త : ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వలన తడ మండలంలోని పంట పొలాలు ఇప్పటికీ మునకలోనే ఉన్నాయి. పలుచోట్ల చెరువులను తలపిస్తున్నాయి. మండల పరిధి లోని ఇరకం, వేనాడు దీవుల్లోనూ పంట నష్టం ఎక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. మండల వ్యవసాయాధికారి జి.కిరణ్ దీవులను సందర్శించి పంట నష్టం వివరాలు సేకరిస్తున్నామన్నారు. మండల పరిధి లోని కాళంగి నది, పాముల కాలువ, కరిపేటి కాలువల సమీపంలోని పొలాలు కూడా ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి.గ్రామ సచివాల యాలకు, రైతు సేవా కేంద్రాలకు అన్నదాతలు వెళ్లి మొరపెట్టుకుంటున్నారు. ఉన్నతాధి కారులు స్పందించి పంటలను కోల్పోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, డిసెంబర్ 3 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని బిరదవాడ సమీపంలో జాతీర రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సూళ్ళూరుపేటకు చెందిన వినోద్,ఉదయ్‌కుమార్‌లు మోటార్ సైకిల్‌పై నాయుడుపేటకు వచ్చి పనులు పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామమైన సూళ్ళూరుపేటకు వెళుతుండగా మార్గమధ్యలో నాయుడుపేట మండలం బిరదవాడ వద్దకు వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీని క్రాస్ చేయబోయి ప్రమాధవశాత్తు మోటార్ సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వినోద్,ఉదయ్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.నాయుడుపేట పోలీసులు కేసునమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## రైతులు ఈ పంట నమోదు తప్పనిసరి : ఏడిఏ



వెంకటగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : రైతులు తప్పని సరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని ఏడిఏ ఎం నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని సీ.సీ.కండ్రిగ, పారవోలు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమము వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది వారిచే నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ మాట్లాడుతూ ప్రస్తుత రబీ కాలము నందు పంట వేయు ప్రతి రైతు విధిగా ఈ పంట నమోదును సంబంధిత గ్రామ వ్యవ సాయ సహాయకులు ద్వారా చేయించు కొనవలేనని తెలిపారు. నిమ్మ మరియు చీని పరిశోధనా స్థానం పెట్లురు శాస్త్రవేత్త ఈ కే నాయక్ కొత్తగా నిమ్మ తోట వేయు రైతులకు సాగు పద్ధతులు మరియు ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సుజాత, ఏఈఓలు రామ మోహన్, గోపి కృష్ణ, వ్యవసాయ సహాయకులు శివకుమార్. విహెచ్ఏ నీరజదేవి, టీపీఎస్ సభ్యులు అలేఖ్య, జడ్ బి ఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డబ్ల్యు యు ఏ ఎలక్షన్‌పై శిక్షణ కార్యక్రమం



వాకాడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయం స్త్రీ శక్తి భవనంలో మంగళవారం నీటి పారుదుల సంఘం ఎలక్షన్ పై వాకాడు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. తాసిల్దార్ రామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల ఎనిమిదో తేదీన నీటిపారుదల సంఘం ఎలక్షన్ జరుగుతుందన్నారు. ఇరిగేషన్ సూచించిన సమాచార మేరకు మండలంలోని 19 ఇరిగేషన్ చెరువులు కి ఆయకట్టుదారుల సంఘం ఎలక్షన్ జరుగుతుందని పోలింగ్ స్టేషన్ వద్ద పోలింగ్ ఆఫీసర్లు, ఎలక్షన్స్ సిబ్బంది ఎలక్షన్ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని తాసిల్దార్ సూచించారు. ఎంపీడీవో అన్నపూర్ణ రావు మాట్లాడుతూ నీటిపారుదల సంఘం ఎలక్షన్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య, శ్రీనివాసులు, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, ఏవో శ్రీనివాస్ రావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పు పరిశ్రమ ఏర్పాటుపై స్థల పరిశీలన



వాకాడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : వాకాడు మండలం దుగ్గరాజుపట్నం పంచాయతీ పరిధిలోని అంజిలాపురం వద్ద సాల్ట్ లైన్స్ ఏర్పాటుకు మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా స్థలమును పరిశీలించారు. ఆయనతో పాటు వాకాడు తాసిల్దార్ రామయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, మండల సర్వేయర్ శకుంతల వీఆర్వో శ్రీనివాసులు ఉన్నారు. ఉప్పు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టేందుకు ఆ ప్రదేశమును సబ్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు,అందుకు సంబంధించిన వివరాలు పూర్తిస్థాయిలో తాసిల్దార్, మండల సర్వేయర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి అందజేస్తానన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి



వాకాడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : మండలంలోని పారిశుద్ధ్య పనులపై దృష్టి అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని గూడూరు డి ఎల్ డి ఓ.వాణి రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం వాకాడు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఇటీవల పెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గ్రామాలు అతలాకుతుల మయ్యా యని కొన్నిచోట ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చాయని, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని వెంటనే అంటువ్యాధులు ప్రబలకుండా వెంటనే పారిశుద్ధ్య పనులు, శానిటేషన్ కార్యక్రమం చేపట్టాలని ఆమె సూచించారు. ఎంపీడీవో అన్నపూర్ణ రావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అవగాహన కల్పించేందుకే పొలం పిలుస్తోంది : ఏఓ



నాయుడుపేట టౌన్, డిసెంబరు 3 ప్రభాతవార్త; గ్రామాల్లో రైతులకు వ్యవసాయ సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నాయుడుపేట వ్యవసాయాధికారి గణేష్ తెలిపారు.ఆయన ఆధ్వర్యంలో మంగళవారం నాయుడుపేట మండలంలోని కాపులూరు, కూచివాడ గ్రామాల్లో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరిపంట పొలాలను ఎఓ గణేష్ తనసిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అయన వెంట రైతులు,వ్యవసాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పంచమి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు జెఈవో



తిరుచానూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్స వాలలో ఆరవ తారీ ఎంతో విసిష్టమైన పంచమీతీర్థం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తితిదే జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులోని పద్మ సరోవరంకు నాలుగు వైపులా పంచమి తీర్థం ఏర్పాట్లను టీటీడీ అధికారులతో కలిసి జెఈవో మంగళవారం తనిఖీ చేశారు. అదేవిధంగా పుష్కరిణిలో గేట్లు, పంచమితీర్థ మండ పాన్ని పరిశీలించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా పుష్కరిణిలోనికి ప్రవేశించేందుకు, తిరిగి బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా నవజీవన్ కంటి ఆసుపత్రి వద్ద, తోళ్ళప్ప గార్డన్స్‌లో, ఎస్వీ హైస్కూల్, పూడి రోడ్డులో హోల్డింగ్ పాయింట్లును టిటిడిలోని వివిధ విభాగాల అధికారులతో కలసి పరిశీలించారు. పటిష్టమైన క్యూలైన్లు,బారికేడ్లు, 120 అన్న ప్రసాద కౌంటర్లు, తాగునీరు, అల్పాహారం, అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన 600 మంది అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. దాదాపు 1000 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తితిదే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి పాదుకల ఊరేగింపు



తిరుచానూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్స వాలలో ప్రధానమైన గరుడ సేవ సందర్భంగా మంగళవారం ఉదయం శ్రీవారి పాదాలు ఊరేగింపు వైభవంగ నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయం నుండి స్వామి వారి స్వర్ణపాదుకలను తిరుచానూరుకు ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకుని వచ్చారు.గరుడసేవ రోజున తిరుమలలో స్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుత్మంతునిపై విహరిస్తారు. అదే గరుడసేవ తిరుచానూరులో అమ్మవారికి జరుగుతున్నపుడు శ్రీవారు తనకు గుర్తుగా పాదుకలను పంపుతున్నాడని ఆలయ అర్చకులు శ్రీనివాసన్ తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ ఇన్స్పెక్టర్ సుభాష్, చలపతి, ఏవియస్ఓ సతీష్,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## స్వర్ణరథంపై శ్రీ మహాలక్ష్మి



తిరుచానూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : స్వర్ణరథంపై శ్రీ మహాలక్ష్మి తిరువీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. కాంతులీనుతున్న స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు విశేష స్వర్ణ, వజ్రాభరణాలను ధరించి భక్తులకు కనువిందు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వర్ణరథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఎఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 13న చొక్కాణి...15న గిరి ప్రదక్షిణం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిష్టాత్మ కంగా నిర్వహించే చొక్కాణి ఉత్సవాన్ని ఈ నెల 13న నిర్వహిం చుటకు సన్నాహాలుల చేపట్టినట్లు ఇఓ టి.బాపిరెడ్డి వివరించారు. ఆలయంలో ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. శివయ్యను అగ్నితో పూజించే విధానం ఉందన్నారు. అందుకు నిదర్శనమే 'చొక్కాణి' ఉత్సవం అని వివరించారు. శ్రీకాళహస్తిలో గిరి ప్రదక్షిణ గురించి విపులంగా వివరించి తానే స్వయంగా పాల్గొన్న చాగంటి కోటేశ్వరరావు శిష్యబృందంచే ఈ నెల 15న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణలు చేపట్టనున్నట్లు ఇఓ టి.బాబిరెడ్డి వివరించారు. గిరిప్రదక్షిణ సందర్భంగా ఏర్పాట్లును ఈ నెల 14న వేయిలింగాల కోనలో ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు ఇఓ తెలిపారు. 15న ఆదివారం పౌర్ణమి సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శిష్యబృందం శ్రీగురువాణి సొసైటికి చెందిన సుమారు 200 మంది గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని వివరించారు. ఈ మహత్తర కార్యక్రమంలో భక్తులు, శ్రీకాళహస్తిపట్టణ ప్రజలు పాల్గొనవచ్చునని ఇఓ బాపిరెడ్డి తెలిపారు.

**నేడు హుండీల లెక్కింపు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు నెల రోజుల పాటు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఓ బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 7గంటలకు గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. రోజు రోజుకు హుండీల ఆదాయం పెరుగుతుందని వివరించారు. విధులనుకేటాయించిన సిబ్బంది నిబంధనలను పాటిస్తూ పాల్గొనాలన్నారు.

భక్తులను పలకరిస్తూ...సౌకర్యాలు తెలుసుకుంటూ

## చైర్మన్ బిఆర్‌నాయుడు తనిఖీలు



తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: వెంకన్న దర్శనానికి తిరుమలకు వచ్చిన భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ,,,,అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకుంటూ త్వరగా దర్శనం చేయించేందుకు మార్గాలను స్వయంగా అన్వేషిస్తున్నారు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు. తొలినుండి సామాన్య భక్తుల దర్శనాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన తనదైన శైలిలో మంగళవారం టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలసి ఆకస్మికంగా నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లను తనిఖీ చేశారు. ఇక్కడ భక్తులనుండి అభిప్రాయాలను తీసుకున్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.50 కోట్లు ఆదాయం



కాణిపాకం, డిసెంబర్ 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.50 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. మంగళవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 19 రోజులకు గాను హుండీల ద్వారా 1,49,62,798 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 5 గ్రాముల బంగారు, 2 కిలోల 785 గ్రాముల గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 11,708 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 31,751 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 491 అమెరికా డాలర్లు, 10 యుఏఈ దినార్స్,178 మలేషియా రింగిట్స్, 20 కెనడా డాలర్లు, 15 ఆస్ట్రేలియా డాలర్లు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి,ధనుంజయ, ప్రసాద్, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి,హుండీ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యం నాయుడు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.